# బతుకు భాగహారం

"బస్సు ఆరను గొడ్తుండాదయ్యా... యింకా లెయి కుండా ఏంది నువ్వు... ఎట్టొస్తాది నీకు మొద్దునిద్ర..." భుజాల మీద చేతులు వేసి కుదుపుతూ హడావిడి పెట్టేస్తోన్న భార్య పిలుపుతో గబుక్కున ఉలిక్కిపడ్డట్టుగా లేచి కూర్చున్నాడు వెంకురెడ్డి.

భర్త లేవడం చూసి ఆ నులక మంచం మీదున్న చిల్లుపడ్డ పాత గొంగళిని చకచకా మడత పెట్టేసి.

"నేం బోయి పాలు దీసుకొస్తా...నువు కానియ్యి అయితే బిన్నా" అంటూ పెద్దెనుము దగ్గర పాలు పితకడానికి పెరట్లో కెళ్ళింది నర్సమ్మ.

"ఏందే నీ తొందర... యింకా కోడి కుయినే లేదు... ఆరుగంటల బండికి యింత లోపలేమి? అన్నీ తొందరే నీకు..." లోపల ఆనందంగానే వున్నా, పైకి నసుగుతున్నట్లుగా అని పంచె లాగి రెండు చేతుల్తోనూ సరిగ్గా సర్దుకున్నాడు వెంకురెడ్డి.

నిజానికి వెంకురెడ్డి రాత్రంతా నిద్రపోనేలేదు. పడుకున్న కాడ్నించి నాలుగయి పోతుందేమోనని తాతలనాటి గోడ గడియారాన్ని చూసుకుంటూనే వున్నాడు కళ్ళు చికిలిస్తూ. ఒకాళకాడ చినుకులు పడితే నరసమ్మ లేచి కురుస్తున్న కాడ గిన్నెలు పెట్టడం చూస్తూనే వున్నాడు. తీరా మూడప్పుడు చల్లగా కునుకు పట్టింది. ఇంతలో పెళ్ళాం తొందర చేయడంతో చటుక్కున నిద్రలేచాడు.

గూట్లో నుంచి పల్దోం పుల్ల తీసుకుని నోట్లో వేసి నములుతూ పెరట్లోకి వచ్చాడు తను కూడ.

రాత్రి పడ్డ నాలుగు చినుకులకి కాబోలు దొడ్లో పేడ, మట్టి కలగలిసి చిత్తడి చిత్తడిగా ఒక విధమైన గత్తు కంపు గాలిలో తేలి వస్తోంది. గుడ్డి దీపాన్నొకదాన్ని ఆధారం చేసుకుని తాటాకు సాలలో పెద్దెనుము కాడ పాలు పితుకుతోంది నరసమ్మ. కొట్టానికి కొంచెం దూరంలో గోడవారగా కొంచెం కట్టిపేళ్ళుండాయి.

వాటిల్లో నుండి ఏదయినా తేళ్ళూ, జర్రులూ, పాంపిల్లలూ వొస్తాయేమోనని వెంకురెడ్డి ఎప్పుడూ ఆమెని హెచ్చరిస్తూనే వుంటాడు. అయినాసరే ఒక వేళాపాళా, రాత్రీపగలూ లేకుండా పని చేస్తూనే వుంటుంది నరసమ్మ. కదిలిస్తే చాలు... "ఓయమ్మో... యిప్పుడేముండాది పని... మా యిద్దరు మనుషులికి. అత్తా, మామ, మరుదులూ, ఆడబిడ్డలూ అంతా వున్నప్పుడు ఎంతెంత చాకిరీ చేసేవోళ్ళం... అదొక సందడిగా వుండేది" అంటూ చరిత్ర విప్పుతుంది.

అప్పటికే పెరట్లోనూ, వాకిట్లోనూ చిమ్మి, కళ్ళాపి జల్లి ముగ్గుపెట్టేసి వుంది... అదేమంటే "పాచి వాకిలి చిమ్మకుండా మొగోడు యిల్లుదాటి పోకూడదయ్యా నీకేం తెలుసు. ఎట్ట బతకతావో ఏమో" అంటూ భర్త మీద జాలి చూపిస్తుంది.

"బతికిందంతా చాల్లే.... ఇంక బతికేదే ముండాది" చెప్తాడు వెంకురెడ్డి ముడతలు పడ్డ ఏభయ్యేనిమిదేళ్ళ శరీరాన్ని తేరిపార చూసుకుంటూ.

ఆ తెల్లవారుఝాము వేకువ నిశ్శబ్దంలో నరసమ్మ పాలు పితుకుతోన్న శబ్దం ఎవరో అజ్ఞాత రాకుమారి వీణ సాధన చేస్తున్నట్లుగా వుంది. పలుదోము పుల్లని బ్రష్‌లా నమిలి నోట్లో నాలుగు వైపులా పోనిచ్చి శుభ్రం చేసుకంటూ చుట్టూ చూశాడు వెంకురెడ్డి. పెరట్లో ఓ పక్కన మూడు రాళ్ళ పొయ్యి మీద తెల్ల దబర్లో నీళ్ళు కాగుతున్నాయి. నిండుగా పుల్లలేసిన పొయ్యి ఆ చీకట్లో దగదగా మండుతోంది. ఆ మంటల నీడలో ఎర్రగా మెరుస్తోన్న వెంకురెడ్డి ముఖం దోరమగ్గి మెత్తబడిన మామిడిపండులా వుంది.

"ఇంకా పళ్ళు దోమడం కూడా అవనే లేదా? " పాల చెంబు పట్టుకుని యింట్లోకి వెళ్తూ ఒక్క కేక బెట్టింది నరసమ్మ.

"అయిపోయిందే వచ్చేస్తుండా... నువు కాఫీ బెట్టు... బస్సుకింకా టయిముండాది లేయే... వాడూర్కే అరను గొడ్తుంటాడు అట్ట... అందర్నీ బిన్నాగా రమ్మని" నోట్లో నీళ్ళు పోసుకుని తుపుక్కున వుమ్మి, తాపీగా మొహం కడుక్కుంటూ చెప్పాడు వెంకురెడ్డి.

నెల్లూరు జిల్లా ఉత్తర ప్రాంతంలోని ఓ మారుమూల పల్లెటూరది. తొలికోడి కూసే వేళకే ఆ వూరు వూరంతా నిద్రలేస్తుంది..

ఆరుగంటల బండికి టవున్లోకి పొయ్యి మళ్ళీ రాత్రి పదిగంటల బండికి వచ్చేవాళ్ళు చాలామందే వుంటారా వూళ్ళో. అందుకే ఆరుగంటల బండి ఎప్పుడూ రద్దీగా వుంటుంది.

పాలవాళ్ళతోనూ, కూరల వాళ్ళతోనూ, చదూకోడానికెళ్ళే విద్యార్థులతోనూ, టవున్లో పనికి వెళ్ళే వాళ్ళతోనూ రద్దీ ఎక్కువ.

"కొంచెం ముందుగా బొయ్యి వుంటే ఏమి? కరెట్టుగా ఆరుగంట్లకి బోవాల్నా? మొదులే నిలబడ్తే కూచోలేవు. కూచ్చుంటే నిలబళ్ళేవు..." నసుగుతూనే పాలు పొయ్యిమీద పెట్టి ముట్టించింది నరసమ్మ.

"నేను బాగానే వుండా... నువ్వే నడుం వంచకపోయి వుండావు" మాటకిమాట అంటిస్తూ తుండుగుడ్డ విదిలించి పైనేసుకుని స్నానానికి వెళ్ళాడు వెంకురెడ్డి.

"ఊ మూడు కాళ్ళొచ్చినా రోసానికి మాత్రం తక్కువ లేదులే" అనుకుంటూ పాలగిన్నె కేసి చూసింది.

"అబ్బయ్యకి ఎర్రంగా కాగిన పాలంటే శానా యిష్టం... ఈ పొద్దు మిద్దింటామె పాలుబొయి లేదని తిట్టబోతాదేమొ.. పెద్దెనుము పాలియ్యలేదని చెప్తేసరి..." అనుకుంటూ ఎర్రగా కాగిన పాలను స్టీలు క్యానులోకి వొంచి మిగిలిన కొంచెం పాలతో భర్త కోసం కాఫీ కలిపి వుంచింది.

పెరట్లో పండిన కూరగాయల్ని, అరిటిపండ్లనీ, జామపండ్లనీ ఒక బుట్టకి సర్ది వుంచింది ముందురోజే. ఈ పాలక్యాను కూడా అందులోనే యిమడ్చాలని ప్రయత్నించి కూరలు నలిగి పోతుండడంలో ఆ ప్రయత్నం మానుకుని విడిగానే వుంచేసింది.

భర్త ఆలస్యం చేస్తున్నాడన్పించి

"బిన్నా కానియ్యయ్యో... ఈ పొద్దు కూడ రుద్ది రుద్ది పొయిబళ్ళ. రుద్దింది చాల్లె యింకరా" అంటూ పెరట్లోకొచ్చి స్నానం చేస్తూన్న వెంకురెడ్డిని తొందరపెట్టింది.

"ఎన్నాళ్ళయిపోయింది అబ్బయ్యని చూసి... వోడెమొ పన్లుండాయని ఈ వూరికే రాకపాయ... మనం బోయి ఆడుండాలంటే వుండలేకపోతిమి. కోడలికి అసలు ఈ వూరంటేనే పడదు. పెళ్ళయిన మరవలకి వచ్చిందేమొ... అంతే ఆ తర్వాత రానేలేదు" మనసులోనే తలపోసుకుంటూ, ముప్ఫయి రెండోసారి తలచుకుంటూ వాకిట్లోని అరుగుమీద గూటి పక్కన్నే కూర్చంది నరసమ్మ.

'వోడిక్కడే కదా కూర్చుని చదూకునేవాడు' అనుకుంటూ... ఆ చోటంటే నరసమ్మకి చానా యిష్టం... చిన్నప్పుడు కొడుకుని ఆ గూటి కెదురుగా కూర్చోబెట్టి అన్నం తిన్పించేది... ఆ అరుగు మీద నిల్చోబెట్టి వీపు మీద ఎక్కించుకుని ఉప్పుమూట ఆట ఆడేది. ఆ అరుగు మీదే కూర్చుని కాళ్ళు వేళ్ళాడేసి ఆ పాదాల మీద వాడ్ని నిల్చోబెట్టి ఐతాంబయితాం ఆడించేది...

అమాట కొస్తే యింకా చిన్నపుడు వాడికా అరుగు మీద కూర్చునే పాలిచ్చేది.

ఆ తర్వాత వోడు పెద్దోడయిన పాట అచ్చరాభ్యాసం చేయించింది కూడా ఆ అరుగు మీదే. పదోక్లాసు పాసయ్యేదాకా వాడు ఆ అరుగు మీద కూచునే బుడ్డి దీపపు వెలుతురులో చదూకునేవాడు. పదయిన తర్వాత నెల్లూరికి పోయినాడు చదవను. బాగా చదూకున్నాడు. పెద్దోడయినాడు... పెద్ద ఉద్యోగంలో చేరినాడు. అంతా బాగానే వుండాది. అన్ని తెలువులూ వుండాయి. అందర్లో మంచి పేరు తెచ్చుకుంటా వుండాడు.. అదేందో మరి అమ్మా, నాయినా ఎట్టుండారో అని మాత్రం అనుకోడు. పాపం ఏం జేస్తాడులే బిడ్డ మాత్రం పెళ్ళానికీ, నాకూ సందన నలిగి సావలేక పొయ్యుంటాడు.

'మన్దేముండాది.. ఈ పొద్దుండి రేప్పొయ్యేవాళ్ళం... వోళ్ళిద్దురూ లచ్చనంగా వుంటే అంతే సాలు' అనుకుంది.

అంతలోనే

'అబ్బయికి జున్నంటే ఎంతిష్టం... పాపం ఆడ వోడికి దొరకతాదో, దొరకదో... మూడో యింట్లో వున్న మునెమ్మ కాడున్న బక్కెనుము నిన్ననే ఈనింది.. సరే ఒక పావుశేరు పోస్తాదేమో అబ్బయికిచ్చి పంపిస్తామంటే, డబ్బాశ బట్టిన ముండ బడి అయ్యోరికి ముందే చెప్పేసిందంట...'

మూడో యింటి మునెమ్మని ముచ్చటగా ముప్పయ్యారోసారి తిట్టుకుంది నరసమ్మ.

"ఏందే ఏం జేస్తుండావీడ?" కొడుకు స్మృతుల్లో పూర్తిగా మునిగిపోయిన నరసమ్మ భర్త పిలుపుతో ఉలిక్కిపడింది.

"పొయ్యేసొస్తా అయితే" చలువ లాల్చీ వేసుకుని, పొందూరు, ఖద్దరు పంచెని గోచీ పోసి కట్టి పెళ్ళి కొడుకులా తయారయిన భర్తకేసి సిగ్గుపడుతూ చూసి నవ్వింది నరసమ్మ.

వెంకురెడ్డి ఏనాడూ ఒంటిమీద చొక్కా వేసుకోడు. బనీనుతోనే తిరుగుతుంటాడు.. ఏదయినా పక్కూరికి పోవాల్సొస్తే తప్ప లాల్చీ బయటికి తీడు...

ప్రతీ నెలా పాల డబ్బులు చేతికొస్తానే చెప్తాది నర్సమ్మ.

"ఈనెల ఒక చొక్కా కుట్టించుకోవయ్యా" అంటూ

"నాకెందుకే గుడ్డలు... వుండేటివి జాల్లే... నువ్వింకా ఒక వెంకటగిరి కోక తెచ్చుకో మిద్దింటామెనడిగి. బాగుంటాది నువు కట్టుకుంటే. ఎప్పుడయినా అబ్బయి దగ్గరికి పొయ్యేటప్పుడు కట్టుకోవచ్చు" చెప్తాడు వెంకురెడ్డి.

"ఆఁ నేంబోతుండా అబ్బయ్య కాడికి. ఆ మదరాసేడుందో తూర్పు, పడమర తెలీదు గాన్యా నాకు..." అంటూ నిష్ఠురపడుతుంది నరసమ్మ.

"జాగర్త... బుట్ట సుబ్బమ్మ కొడుకు తెచ్చి బస్సులో పెడ్తాడ్లే... నేను చెప్పినా... ఈడ ఫర్వాలేదు గానీ.. ఆడ నెల్లూళ్ళో బస్సెక్కేప్పుడు జాగర్త... మన దొడ్లోరి పిలగాడు కండక్టరుగా వుండే బస్సులోనే సూస్కొని ఎక్కు. ఆ బస్సు ఎనిమిది గంటలకంట నెల్లూర్లో. వాడైతే నిన్ను గుర్తుగా తీసుకపోయి అబ్బయ్యోళ్ళింటి కాడ దింపుతాడు. మర్సిగెన నిద్దరబోతావేమో. బస్సెక్కినా

వంటే సాలు నీకు ఒకటే నిద్దర... మాయిదారి నిద్ర. అబ్బయ్యని అడిగానని చెప్పు..." తడిక గేటు కానుకుని భర్త కదిలేంత వరకూ ముద్దుముద్దుగా నసుగుతూ, జాగర్తలు చెప్తూనే వుంది నరసమ్మ.

* * *

నెల్లూర్లో దొడ్లోరబ్బయ్య కండక్టరుగా పనిచేసే బస్సు పట్టుకోటానికి చాలానే శ్రమ పడ్డాడు వెంకురెడ్డి.

ఒక చేతిలో బరువుగా వున్న కూరల బుట్టా, రొండో చేతిలో పాలక్యానూ, జారిపోతూన్న పైగుడ్డా, కిర్రుకిర్రుమని శబ్దం చేయడమే కాకుండా గట్టిగా అడుగేసినప్పుడల్లా అరికాల్లో గుచ్చుకుంటున్న మేకూ... నవంబరు నెలలోని ఆ ఉదయం ఏడుగంటలకే చెమటలు పట్టేలా చేసింది వెంకురెడ్డికి. దొడ్లోరబ్బయ్యని బస్టాండులో కనిపెట్టేక సాక్షాత్తూ ఆ ఏడుకొండలవాడే కొండ దిగి తనకోసమొచ్చినట్లుగా అన్పించిందతడికి. మద్రాసు బస్సు ఎక్కి కూర్చున్నాక లండన్ వెళ్ళే విమానం సునాయాసంగా ఎక్కి కూర్చున్నంత గర్వంగా ఫీలయ్యాడు వెంకురెడ్డి.

ఎక్కి సీటు చూసుకుని కుదురుగా కూర్చున్నాక బస్సు కదలిన కొంచెంసేపటికి చెమటలు తగ్గి స్థిమితపడి... హఠాత్తుగా కొడుకు గుర్తొచ్చాడతడికి. అప్పుడే వాడ్ని చూసి రెండేళ్ళయిపోయింది. వాడేమో రాడు... తనకేమో చీటికీ మాటికీ మదరాసు వెళ్ళాలంటే మాటలా? కుదరదు. మంచి, చెడ్డలన్నీ దొడ్లోరబ్బయ్య ద్వారానే తెలుస్తుంటాయి.

చిన్నకిష్టయ్య ఎట్టుండాడో?... అప్పుడోడికి రెండేళ్ళు... ఇప్పుడింతోడై బడికి పోతుం టాడేమో... దొడ్లోరబ్బయ్య మళ్ళీ పాప పుట్టిందని చెప్పాడు. ఆ బుడిగి ఎంతయిందో...? తను తాతనని తెలీనే తెలీదు వాళ్ళకి.

మనమనుకోగూడదుగానీ వాళ్ళకెట్ట తెలస్తాది? వాళ్ళకేనాడైనా యింత చొక్కాగుడ్డ తీసుచ్చుంటే గదతను. ఏనాడయినా బిస్కెత్తులు కొనిచ్చి ముద్దు చేసుంటే గద... కోడలికయినా పెళ్ళయి పదేళ్ళయితే యింత జాకెట్టు ముక్కకొనగలిగానా? ఇంక ఆయమ్మకి ప్రేమ, అభిమానం రమ్మంటే యాడ్నుంచి వస్తాది? అబ్బాయికి మాత్రం ఆ చదూకునేప్పుడు ఏం కొనిచ్చి నామో కడుపు కట్టుకుని మంచిగుడ్డలు... మళ్ళీ ఏనాడయినా యింద నాయినా ఈ పది పైసలు నీకేం ఖర్చులుండాయో అని చేతుల్లో పెట్టగలిగామా?... ఇహన వోడికి కోపమోస్తాదంటే రాదా?

ఈ ముసల్డి ఎంత సేపయినా నసపెడ్తాది కానీ కోడల్ని, వోళ్ళు మాత్రం ఏ జేస్తారు?... ఈ బస్తీలలో ఎంతెంత జీతాలొచ్చినా చాలకపోయే.

ఆ పల్లెటూళ్ళో కూరలు పండించి అమ్ముతా... పాలుబోస్తా... యింటి బాడిగ లేకా తమ యిద్దరి పొట్టలు ఎల్లమారడం లేదే... ఇంక మదరాసులాంటి మహానగరంలో వాళ్ళు మాత్రం ఏం మిగల్చగలరు.... వాళ్ళనీ అనుకోడానికిల్యా పాపం... వెంకురెడ్డి కళ్ళు చెమ్మగిల్లాయి.

"నాయినా... నీకెందుకు గమ్మనుండు... ఇట్టాటెకరాలు పది కొనుక్కుందాం. నీకు పొలంచాకిరీ తప్పిందనుకో... నేను సంపాదించి పదెకరాలు కొని మంచి సేద్దిగాణ్ణి పెడతాను. నువు అజమాయిషీ చేద్దూగాని, ఈ ఎకరం నేల కోసం నువు బాధ పడబాక" కొడుకు చదువు కోసం చివరి ఎకరా అమ్మినపుడు కొడుకు తనని ఆర్తిగా ఓదార్చినప్పటి దృశ్యం.

"ఇంకెంతమ్మా... ఆరునెలలే.. చదువయిపోద్ది... నాకుద్యోగం వస్తే మాత్రం నాయిన్ని ఏ పనీ చేయనీయను... గమ్ముగా యింట్లో కూర్చోవాల్సిందే. నువ్వు మాత్రం? నిన్నసలు వంట చేయనిస్తానా? మంచి పనిమనిషిని పెడ్తాను. ఈ వూళ్ళో పొలం లేకపోతేనే మంచిదమ్మో మనికి... మీ యిద్దర్నీ నాతో తీసికెళ్ళిపోవచ్చు." అంటూ అమ్మతో పరాచికాలాడుతూ వెంట వెంటనే తిరిగేవోడు.

"అప్పుడిన్ని మాటలు జెప్పి యిప్పుడెలా మొండి చెయ్యి చూపించాడో చూడయ్యా" అంటూ ఏడుస్తుంటుంది నరసమ్మ. నరసమ్మ ఏడుపు తనకు నచ్చదు. వాడి యిబ్బందులు వాడివి... వాడి ఆలోచనలు వాడివి. మనం చెయ్యాల్సింది చేశాం మన ధర్మం.

ఈ ముసిల్దానికి మొదట్నుండీ కూడా అంతే... అబ్బయ్యంటే వల్ల మాలిన అభిమానం, ప్రేమ... ఆ యిదిలో ఒక్కోసారి తన్ని కూడా పట్టించుకునేదే కాదు. ఒక్కగానొక్కడయిపాయె. పంచప్రాణాలన్నీ వాడి మీదే పెట్టుకుని పెంచుకొచ్చింది. అందుకే అలా దూరమయ్యేసరికి తట్టుకోలేక పోయింది.... జబ్బున పడింది... లేచింది.... మళ్ళీ జబ్బు పడింది. మళ్ళీ లేచింది. కొంత కాలానిగ్గాని రాటుదేల్లేకపోయింది.

ఇప్పుడు కూడా నర్సమ్మే తనని బలవంతం చేసి ప్రయాణం చేయించింది... దూరంగా వుంటుండబట్టి యిలా మమతల్లేకుండా పోతుండాయేమో... ఒక్కసారెళ్ళి కన్పడితే అబ్బాయికి మనసు కరుగుద్దేమో... మన్ని రమ్మన్నా రమ్మంటాడు.

అబ్బయ్య అనకపోతే మాత్రమేందయ్యా... నువ్వే కదిలించు కావలిస్తే నా మీదే చెప్పు. నాకేం భయం? మీ అమ్మ ముసల్దియి పోయిందిరా నాయినా. చేసుకోలేకుండా వుండాది. ఇద్దరం ఎవరికేమొచ్చినా ఆ పల్లెటూళ్ళో చూసే వోళ్ళెవరు? నీకాడికొచ్చి ఆయిగా కృష్ణా, రామా అనుకుంటా వుంటాము. పిల్లల్ని చూసుకుంటా పడుంటాం అని చెప్పు.

నోరు తగ్గిందని కూడా జెప్పు... అబ్బయ్య, కోడలు ఎట్టచేసుకున్నా కూడా మనం మంచీ, శెబ్బరా అడగమని చెప్పు అంటూ చెప్తూ చెప్తూనే భోరున ఏడ్చేసింది.

నాలుగు దినాలుగా దీని కోసరమే తన్ని తొందర చేసి ప్రయాణం చేసిందా? రాత్రేమో మళ్ళీ ఒకేలకాడ.

"వొద్దులేయ్యా... నువ్వియన్నీ ఏమీ అడగబాక. మనకి ఎట్నో ఈడ జరిగిపోతా వుండాది కదా. అట్నే మంచొచ్చినా, చెడ్డొచ్చినా దేవుడుండాడు... ఈ వూరోళ్ళుండారు..."

"పాపం వోణ్ణి మనమూ సతాయించి, అట్ట కోడలూ సతాయించి ఎట్ట చెప్పు?" అంటూ గొంతు గరగరలాడుతుంటే లేచి పెరట్లోకెళ్ళింది.



కథా నిలయం
4682

వెంకురెడ్డికి అర్థమయిపోయింది. కళ్ళు తుడుచుకోడానికే నరసమ్మ లేచి బయటి కెళ్ళిందని. దానికీ తనకీ యిద్దరికీ తెలుసు. ఇంతన్నం కోసరం వాడి కాడికి పోవాలనుకోవడం లేదు తాము. ఒక్కడంటే ఒక్కడు. ముసలితనంలో వాడి కాడుండాలని, పిల్లల్ని ఆడించుకోవాలనీ కోరిక. ఎంత అణచుకోవాలన్నా అణచుకోలేకపోతిమి.

పిచ్చిది... దానికోసమయినా కొన్నాళ్ళు కొడుకు దగ్గిర వుంటే బావుండునని వుంది వెంకురెడ్డికి. కొడుకేమంటాడో? కోడలేమంటుందో? అయినా తను నోరు తెరచి అడగ్గలడా?

వెంకురెడ్డి అంతరంగం ఆలోచనల సముద్రంలా ముందుకీ వెనక్కీ ఆటుపోటు లేసుకుంటూ కదం తొక్కుతోంది. వెంకురెడ్డితోనూ, అతడి ఆలోచనల పరంపరతోనూ యే మాత్రం సంబంధం లేనట్లుగా ఒంటిగంట ప్రాంతంలో మద్రాసు చేరుకుంది బస్సు.

"అప్పుడ్నేవొచ్చేసినా మంటయ్యా" దొడ్లోరి సుబ్రహ్మణ్యాన్ని వుద్దేశించి ప్రశ్నించాడు వెంకురెడ్డి.

"వొచ్చేసింది పెదనాయినా... నువ్వప్పుడే దిగబాక. వీళ్ళందర్ని దిగనీయ్... నేనీ టిక్కెట్ల సంగతంతా అప్పజెప్పేసి మెల్లింగా వచ్చి నిన్ను దీసుకుపోతా... అప్పటిదాకా యిక్కడ్నే వుండు" చెప్పాడు సుబ్రమణ్యం.

* * *

నాలుగు రోజులు గడిచిపోయాయి.

భర్తని ఒక్కరోజు కూడా వొదిలి వుండడం అలవాటులేని నరసమ్మకి నాలుగు యుగాలు గడిచిపోయినట్లుగా, పెద్ద వరదొచ్చి తమ వూరంతా కొట్టుకుపోయినంత దిగులుగా వుండాది.

చీకటి పడే వేళకి.

పనంతా చేసుకుని, వాకిట్లో నులక మంచం వేసుకుని తడిక గేటు తీసి వుంచి పది గంట్ల బస్సు వొచ్చేదాకా మసకచీకట్లో ఎవరొచ్చినా ఎడమ అరచేతిని నుదుటి మీద కళ్ళకి అడ్డం పెట్టి నిక్కనిక్కి చూస్తుంది. పదిగంటల బస్సు వచ్చిపోయి సందడి తగ్గిన తర్వాత గానీ లోపలికెళ్ళి తలుపేసుకుని పడుకోదు.

ఆసుబోసినట్లుగా యింట్లోకీ, వాకిట్లోకీ తిరుగుతుంది.

"అయినా నా పిచ్చిగానీ, వాడప్పుడే రానిస్తాడా? ఇంత దూరం పోయినాయిన పోవద్దా? రావద్దా?" అంటూ మరుక్షణంలో తనకు తాను నచ్చజెప్పకుంటుంది.

"అబ్బయ్య వుణ్ణాడో, లేదా ఏ బయటూరికయినా పొయ్యుండాడో, వాడొచ్చేదాక సూస్కొని గద రావాల" అనుకుంటుంది.

"ఈయయ్య ఎట్ట బోయినాడో ఏమో, మొదులే చూపు తక్కువయింది. ఈడ ఊళ్ళో నడిచేదే కనాకష్టం...ఆడెట్టబోయినాడో... అయినా దొడ్లోరి సుబ్రమణ్యం అంత మాటలెక్కలేని మనిషి కాదులే... కూడానే వుండి తీసుకు పొయ్యుంటాడులే..." అనుకుంటుంది మళ్ళీ.

"రొండే రెండు చొక్కాలుండాయి. ఆడెవురో జెప్పినట్లు ముడ్డిమీది కొకటి, బండమీద కొకటి... ఈడంటే చొక్కా లేకుండా తిరిగినా ఎల్లిపోతాది.. ఆడెట్టాకుదురుద్ది... నాల్రోజుల్నుండీ ఎట్ట చేస్తుండాడో యేమో... కోడలు వుతికియ్యాలంటే మాటలా"

"ఏందో పాపిష్టిదాన్ని ... గమ్ముమనుణ్ణాయన్ని పోపొమ్మని పోరు పెట్టేస్తిని. ఏంజేస్తుండాడో ఏమో" అనుకుంటుంది.

"ఛీ.. ఈటివల్ల గదా నేను ఎల్లలేక పోయింది... ఇయ్యి లేకుంటే యింకే ముండాదీడ బాదరబందిర.. నేనూ ఆయయ్యతో గూడ పొయ్యుండనా? నాఖర్మ..." అంటూ తన కోపమంతా పాలిచ్చే గేదెల మీద చూపించుతుంది, వాటి మూలంగానే తను ఆగిపోయినట్టు.

ఎప్పుడూ యజమానురాలి ఆప్యాయతనీ, అభిమానాన్నీ తప్ప కోపాన్ని చవి చూడని మూగజీవులు విస్తుపోయి చూస్తున్నాయి నర్సమ్మ కేసి.

నరసమ్మని యింకా యింకా అసహనంతో కూడిన ఎదురెదురు చూపులుకి గురి చేయడం యిష్టంలేక ఆముని మాపువేళ ఆరుగంటల బస్సులో దిగి, ఖాళీ బుట్ట చేతబట్టుకుని కాళ్ళీగించుకుంటూ చికిలించి చూస్తోన్న నర్సమ్మ కళ్ళకి మెలిమెల్లిగా స్పష్టమవుతూ వచ్చాడు వెంకురెడ్డి.

"వొచ్చావా?... అదే అనుకుంటుండా... ఈ పూటన్నా వొస్తాడా రాడా ఈ మనిషి... నేనుండేది మర్సిపొయ్యి కొడుక్కాడ్నే వుండిపోతాడా? అని... మంచినీళ్ళిచ్చేదా?" అంటూ లోపలికి పరిగెత్తి చెంబుతో నీళ్ళు తెచ్చిచ్చి.

"ఎట్టుండాడయ్యా అబ్బయ్య... నన్నడిగాడా? కోడలూ, పిలకాయిలూ బాగుండారా?... ఇదిగో ఈ ఎదవముండలు లేకపోతే నేనూ రాకపోయానా? ఆమాట నువు చెప్పినావో లేదో.. ఎంత బాధపడ్డాడో కన్నడు...." తన ధోరణిలో తాను చెప్పుకుపోతూ వుంది నరసమ్మ భర్తకేసి చూడకుండా.

భార్యవంక చూడ్డానికి భయపడ్తున్నట్లుగా, యింట్లోకి రావడానికి కాళ్ళాడక వాకిట్లో వాల్చి వున్న కుక్కి మంచం మీద కూలబడ్డాడు వెంకురెడ్డి. చేతిలోని బుట్ట కిందపెడుతూ.

"నీళ్ళు కాగుండాయి. మళ్ళెందుక్కూసుంటుండావు. కాఫీ పెడ్తుండాను తాగి నీళ్ళు పోస్కోని రాపో... అవతల అన్నీ చెప్తువు కాని"

క్షణంలో కాఫీ కలిపి తీసుకొచ్చి భర్తకిచ్చి, పక్కనే కింద నేలమీద చతికిలబడింది నర్సమ్మ "ఏందయ్యా" అంటూ

కాఫీ మింగుడుపడనట్లుగా గుటక, గుటకా తాగి తాగి చాలాసేపటికి నోరు విప్పాడు వెంకురెడ్డి.

"వోడు చాలా మారిపోయాడే"

ఆమాటకి దీర్ఘంగా నిట్టూర్చింది నరసమ్మ ........

"ఓస్ యింతేనా?... యింకా ఏందో అనుకున్నా... వోడు మారిపోక అట్నే వుండాడని ఎవరు జెప్పారిప్పుడు... మారిపోబట్టేకదా మనమేడుండామని కూడా తలవంది... అదేదే కొత్తగా కనిపెట్టినట్లు యింత దూరం పోయి ఈ వార్త మోసుకొచ్చావా?" అంది... భర్త చెప్పిన విషయం తను ఎదురు చూసిందే సుమా అన్నట్లు తేలిగ్గా తీసిపారేస్తూ.

"అట్టగాదే... మారిపోయ్యేడంటే... వోడసలిప్పుడు యింటికాడగూడ వుండడం లేదు... కోడలు పాపం ఆ పిల్లల్ని బెట్టుకుని ఒంటిగా యాతన పడ్తావుండాది... ఒకటే ఏడుపనుకో..." బాధగా చెప్పాడు వెంకురెడ్డి.

"ఏందయ్యా యిది...యింటికాడుండక యింకేడుంటాడు" విస్తుపోతూ ప్రశ్నించింది నర్సమ్మ.

"వాడు పన్జేసే కంపెనీలోనే ఒక రూముంటాదంట. అన్ని సౌకిరాలు చేసుకుని అడ్నే పొడుకుని అడ్నే ఆఫీసు పని చేసుకుంటాడంట. ఎప్పుడయినా రెండు మూడు దినాలకోపారి వచ్చి కనపడతాడంట. పిలకాయలు కూడా భలే దిగులుగా వుండారు"

"ఏందయ్యా నువు చెప్పేది? అట్ట వుండేదేందని అడగలా కోడలు?"

"అడిగితే ఏదో ఒకటి చెప్తుళ్ళా? ప్రయివేటు కంపెనీలో పని జాస్తి. వచ్చేవోళ్ళు, పొయ్యే వోళ్ళు ఎక్కువగా వుంటారు. వాళ్ళందరూ యింటికి రావాలంటే కష్టం... అంటాడంట. ఇంతకు ముందు పొద్దుబోయినా యింటికొచ్చే వాడంట దినుమ్మా. ఈ నడమీనడమ రాత్రిళ్ళు కూడా రాకుండా అడ్నే పొడుకుంటాడంట. అదేందని అడిగితే రాత్రి వొచ్చినోళ్ళతో మాట్లాడతా పొద్దుపోయింది అంటాడంట. మరీ గట్టిగా నిల్దీసిందని ఈ మధ్య కోడల్ని కొట్టాడంట కూడా"

భార్యని కొట్టడమనే అనాగరికమైన చర్యని దిగమింగలేనట్లుగా వుంది వెంకురెడ్డి పరిస్థితి.

"నువ్వడగలే మరి?"

"ఎందుకడగలా? అడిగితే జవాబు సరిగ్గా చెప్తుండాడా? ఇప్పుడేం కొంపలు మునగ లేదులే అని కసిరాడు. సిటీబస్సులు రెండు మారి దినుమ్మా యింటికి పోవాలంటే కష్ట మన్నాడు.అట్టయితే కాపరం ఈడ్నే బెట్టు అన్నా. ఈడ యిల్లు దొరికేది కష్టమన్నాడు. ఇహన్నేనేం జెప్పేది? అసలు పది మాటల కొక్క మాట మాట్లాడ్తుండాడా? మవునంగా వుండాడు. అడ్డాల్నాటి బిడ్డా చెప్పు నేను కసిరి చెప్పేదానికి...అందుకే ఆ కోడలి గోష్ట చూళ్ళేక గమ్మున వచ్చేసినా" కళ్ళు చెమరుస్తుండగా చెప్పాడు వెంకురెడ్డి.

నరసమ్మ చాలాసేపు విభ్రాంతిగా చూస్తుండిపోయింది.

వెంకురెడ్డి చెప్పిందేమీ ఆమెకు కొరుకుడు పడ్డం లేదు.

'తల్లిదండ్రి సరే అల్లం అయిపోయినామనుకున్నా. ఏదో దూరంగా వుణ్ణా కూడ కొడుకు, కోడలు అన్నోన్నంగా వుంటే చాల్లే అనుకుంది తల్లి మనసు యిన్నాళ్ళూ. ఈయనేంది యిట్ట చెప్తుండాడు?'

ఇదంతా ఏదో అసహజంగా, భిన్నంగా, విభ్రమంగా తోస్తోంది నరసమ్మకి. ఆమె మట్టి బుర్రకి యిదెంత మాత్రమూ మింగుడు పడ్డంలేదు.

సంగతులన్నీ చిక్కుబడిపోయిన వెంట్రుకల్లా అస్తవ్యస్తంగా వున్నాయి.

తన చిన్నప్పుడు నాయినా, నలుగురు చిన్నాయినన్లూ, చినమ్మలూ నాయినమ్మా, తాతయ్యా, పన్నెండేళ్ళకే మొగుడు చచ్చిపోయి పుట్టింటి కొచ్చిన మేనత్తా... అంతా కలిసే వుండేవాళ్ళు. ప్రతిరోజూ ఒక తిరణాలలా వుండేది. ఇంట్లో ఎవరికేం ఆపదొచ్చినా, కన్ను నొచ్చినా, కాలు నొచ్చినా యిల్లు యిల్లంతా కదిలిపోయేది.

కొడుకులు తమంత వాళ్ళయినా కూడా నాయినా, చిన్నాయినన్లు తాత మాట జవదాటే వోళ్ళు కాదు. అవ్వా, తాతా పోయిన పాట కూడా నాయినా, చిన్నాయినన్లు ఒకరినొకరు ఎంత బాగుండేవాళ్ళు, మేనత్త రామలచ్చుమ్మని అంతా ఎంత అబ్బురంగా చూసుకునేవాళ్ళు.

తనుమాత్రం...? పదమూడేళ్ళకి పెళ్ళి చేసుకొనొచ్చి ఈ యింటికి ఎంతెంత చాకిరీ చేసింది. అత్తా, మావా, యిద్దరు ఆడబిడ్డలూ, మరుదులూ... అందరి మంచి చెడ్డలూ చూసి పంపించింది. మావ పుణ్యాత్ముడు ఒకరిచేత ఒక్కపని చేయించుకోకుండా ఎల్లిపోయాడు. అత్తని ఆర్నెల్లు మంచాన పెట్టి ఉచ్చా, దొడ్డికీ కూడా ఎత్తి పోసింది తను. ఊరు ఊరంతా 'అబ్బా నర్సమ్మ జేసిందమ్మా... తల్లిని చూసినట్టు చూసింది అత్తని' అన్నారు. అట్టంతా వుండేవాళ్ళం.. ఇప్పుడు కొడుకిలా తమని దూరంగా వుంచేయడమే పెద్ద ఆశ్చరేకంగా వుంటే... యిప్పుడిదేంది ఆఫీసులో వుండేదేంది. ఒక్కడే...? రెండు మూడు దినాలకొకసారి వచ్చి పెళ్ళాం పిల్లల్ని చూసేదేంది...? ఈయన తెలిసి చెప్తండాడా, తెలీక చెప్తండాడా, అసలేందో అన్నట్లు భర్తకేసి చూసింది ఆతృతగా చేతులు తిప్పుతూ .....

అయితే వెంకురెడ్డికి మాత్రం పూర్తిగా అర్థం కాకుండా ఏమీలేదు. తను మాటల్లో చెప్పలేక పోయినా యాభయ్యేనిమిదేళ్ళ జీవితం నేర్పిన కొద్దిపాటి జ్ఞానంతో మానవుడి పరిణామ క్రమాన్ని గురించిన ఆలోచనలో పడ్డాడతడు.

ఉమ్మడి కుటుంబాల్లో నుండి విడివడి వేరు కాపరాలు పెట్టడం తప్పుగానూ, నేరం గానూ వుండేది తమ దినాల్లో. సరే మనిషి నాగరికత తెలిసి చదువుకోవడం మొదలెట్టేక కొన్నాళ్ళకి ఉద్యోగాలనీ, వ్యాపారాలనీ వేరుగా వుండటం అలవాటు చేసుకుని అందులోనే సుఖం చూసుకున్నాడు. ఇప్పుడింకా ఆ వేరు కాపురాల మీద గూడ విసుగుపుట్టి పెళ్ళాం పిల్లలూ గూడ వుండొద్దు ఒక్కడే, తనొక్కడే స్వేచ్ఛగా వుండాలనుకుంటున్నాడు. ముందుతరాల ప్రతినిధిలా అవుపిస్తోన్న తన కొడుకుని గురించి ఆలోచిస్తూ భారంగా కళ్ళు మూసుకున్నాడు వెంకురెడ్డి.

తేళ్ళ కుటుంబాన్ని మింగినట్టుగా వుందతడి కంఠం.

సాహిత్యనేత్రం, ఏప్రిల్-జూన్ 1996
సాహితీ వేదిక - చీరాల వారు నిర్వహించిన కథల పోటీలో
ద్వితీయ బహుమతి పొందిన కథ